## సన్మానం



రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న జగదీశ్వర్, ముజీబ్

అఫ్జల్‌గంజ్: ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా టీఎన్జీవోస్ సెంట్రల్ కార్యాలయంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌ఎం .ముజీబ్ హుస్సేని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. నిరంతరం సమాజానికి సేవాలందించాలని వారు పిలుపునిచ్చారు.

## కౌండిన్య భవన్‌లో మహా అన్నదానం



జియాగూడ: పురానాపూల్ గౌండ్ల మఠం సురాభాండేశ్వర ఆలయంలో మహోత్సవాల్లో భాగంగా గురువారం కౌండిన్య భవన్‌లో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సురాభాండేశ్వర గౌండ్ల మఠం ధర్మకర్తల పాలక మండలి అధ్యక్షుడు గౌడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్, సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్రా భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షులు గద్దమీది యగ్నేశ్వర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పంజాల అశోక్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కొత్త ప్రవీణ్ కుమార్ గౌడ్, సాయినాథ్ గౌడ్, మల్లం శివకుమార్ గౌడ్, దేశం శంకర్, హరిప్రసాద్ గౌడ్, కందుల మోహన్ గౌడ్, నిర్మల ప్రవీణ్‌కుమార్ గౌడ్, సుధీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన 'శివోహం'



గన్‌ఫౌండ్రీ: స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి బషీర్‌బాగ్‌లోని ఆలయంలో శివోహం–2025 పేరిట ఏర్పాటు చేసిన సంగీత నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. సుమారు 8 గంటల పాటు వివిధ అంశాలపై సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక, హిందుస్థాని గాత్ర కచేరి, వయోలిన్, కీ బోర్డ్, ఫ్లూట్ విద్యార్థుల ప్రదర్శనలు ఆకర్షణీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఆంజనేయులు, సంస్థ వ్యవస్థాపక సభ్యులు గాడిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలు



చాంద్రాయణగుట్ట: బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి ఆధ్వర్యంలో ఉప్పుగూడ డివిజన్ పార్వతీనగర్‌లో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సంత్ సేవాలాల్ జీవితం ప్రతి ఒక్కరూ మార్గదర్శకం అన్నారు. మత మార్పిడీలకు వ్యతిరేకంగా ఆయన పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోవాలి

మెహిదీపట్నం డీఈ సుధీర్‌కుమార్



నాంపల్లి: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను ప్రభుత్వం ఇస్తోందని మెహిదీపట్నం డీఈ టి.సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సెలూన్లు, ధోబీఘాట్‌లకు ఉచితంగా విద్యుత్ సబ్సిడీని అందజేస్తున్నట్లు వివరించారు. వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించడానికి, వినియోగదారులకు తలెత్తుతున్న సమస్యలను అధిగమించడానికి సుధీర్‌కుమార్‌తో ఏసీగార్డ్స్‌లోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో 'సాక్షి'ముఖాముఖిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలకు సమాధానం ఇచ్చారు.

**అర్హులై ఉండి జీరో బిల్లు పొందని వినియోగదారులు ఉన్నారా? బిల్లు రానివారు ఏమి చేయాలి?**

- చాలా మంది ఉన్నారు. జీరో బిల్లు పొందని వారు వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులను సంప్రదించి అప్‌డేట్ చేసుకోవాలి. అప్పుడే జీరో బిల్లు జనరేట్ అవుతుంది.

**జీరో బిల్లు 200 యూనిట్లకు మించితే విద్యుత్ ఛార్జి చేస్తారా?**

- ప్రభుత్వం ఇచ్చిన రాయితీలకు మించి విద్యుత్‌ను వాడితే ఛార్జి చేయడం జరుగుతుంది.

**వేసవి రాక ముునుపే విద్యుత్ కోతలు ఉన్నాయనే వాదన నిజమేనా?**

- విద్యుత్ కోతలు ఉన్నాయనే మాట వాస్తవం కాదు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వాటిని నమ్మొద్దు. మరమ్మతులు, చెట్ల తొలగింపు వంటి పనులు జరిగేటప్పుడు ముందస్తు సమాచారం ఇస్తూ విద్యుత్‌ను నిలుపుదల చేస్తాం. తిరిగి పునరుద్ధరిస్తాం.

**విద్యుత్ అంతరాయాలు, ఇతరత్రా సమస్యలేమైనా ఉంటే ఎవరికి ఫిర్యాదు చేయాలి?**

- విద్యుత్‌కు సంబంధించిన సమస్య తలెత్తితే వెంటనే 1912 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

**వేసవిలో తరచూ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగడానికి కారణాలేమిటి?**

- వేసవిలో గోడౌన్లు, కార్ఖానాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అగ్ని ప్రమాదాలన్నింటికీ షార్ట్‌సర్క్యూట్ ఒకటే కారణం కాదు. నిబంధనలు పాటించకపోవడం, నష్టాల్లో కూరుకునిపోవడం, ఎర్త్ సరిగా లేకపోవడం వంటివి ఉంటాయి.

**బహుళఅంతస్తుల భవనాల్లో పాటించాల్సిన నియమాలేమిటి?**

- బహుళఅంతస్తుల భవనాలు(అపార్ట్‌మెంట్స్) నిర్మాణం జరిగితే సీఈఐజీ అనుమతి తీసుకోవాలి. లేదంటే భవనానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తాం.

**పెండింగ్ బిల్లు అని ఎప్పుడు నిర్ధారిస్తారు. ఎప్పుడు కనెక్షన్ కట్ చేస్తారు?**

- గడువు లోగా బిల్లు చెల్లించకుంటే పెండింగ్ బిల్లుగా నిర్ధారించడం జరుగుతుంది. సకాలంలో బిల్లును చెల్లించకుంటే సర్‌ఛార్జి చేస్తాం. అప్పటికీ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే కనెక్షన్ కట్ చేస్తాం.

**విద్యుత్ చౌర్యం జరుగుతోందా. అలాంటి వాటిపై మీరేమి చర్యలు తీసుకుంటున్నారు?**

- ప్రతి నెలలో మాస్ ఇంటెన్సివ్ ఇన్‌స్పెక్షన్ ఉంటుంది. దొంగ కనెక్షన్లను గుర్తించడానికి ప్రత్యేక టీమ్ పనిచేస్తోంది. అలాంటివి జరిగితే డీపీఈ (డిటెక్షన్ ఆఫ్ ఫిలిఫరేజ్ ఎనర్జీ) కింద కేసులు నమోదు చేస్తాం.

**పెండింగ్ బకాయిలను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చా?**

- పెండింగ్ బిల్లులే కాదు, రెగ్యులర్ బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో ఫోన్ పే, గూగుల్ పే ద్వారా బిల్లులను మీ సెల్ ఫోన్ల నుంచే చెల్లించుకోవచ్చు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి



డీసీ లావణ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అబిడ్స్–14వ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్యకు బొకె అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమస్యలతో కూడిన మెమోరాండంను ఆమెకు అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని ధూల్‌పేట్, జాంబాగ్, గోషామహల్, చుడిబజార్, అఫ్జల్‌గంజ్, అబిడ్స్, ఆగాపురా తదితర ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ మరమ్మతులు, విద్యుత్‌దీపాల ఏర్పాటు వేగవంతంగా చేపట్టాలన్నారు. బేగంబజార్ ఎంజే బ్రిడ్జి వద్ద నెల రోజులుగా వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ లావణ్య సానుకూలంగా స్పందించారు. వేగవంతంగా వీధి దీపాల ఏర్పాటు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు ప్రియాగుప్తా, విజయ్ ముదిరాజ్, భజన్ సింగ్, నరేష్ గౌడ్, జోగేందర్, అహ్మద్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య పూజలు..అన్నదానాలు



అన్నదానం చేస్తున్న బజరంగ్‌సేనా నాయకులు ఎన్‌ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో పుణ్యమైందని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని కోఠిలోని నల్లపోచమ్మ ఆలయంలో ప్రజల సుభిక్షం కోసం మహా చండీ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమావాస్యను పురస్కరించుకొని బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో మహా చండీ హోమం నిర్వహించామని తెలిపారు. నాయకులు ప్రభు, శ్రీకాంత్, రవి, నరేష్, ఆశీష్, పవన్, సాయి పాల్గొన్నారు.

## స్టార్టప్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

రాయదుర్గం: భారతదేశంలో స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టీహబ్–ఎన్‌ఎస్‌ఆర్‌సీఈఎల్, ఐఐఎం బెంగళూరుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్‌ఎస్‌ఆర్‌సీఈఎల్ సీఈఓ ఆనంద శ్రీ గణేష్, ప్రోగ్రామ్ మేనేజర్లు విశాల్, కార్తీక్‌కుమార్ చౌదరి, టీహబ్ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్ జాగిర్దార్, అధికారులు పాల్గొన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌లోని పర్యావరణ వ్యవస్థలలో మహిళల నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు గొప్ప అవకాశాలను అందించడానికి రెండు సంస్థలు సమిష్టిగా కృషి చేస్తాయి. ఈ కార్యక్రమంలో టీహబ్, ఎన్‌ఎస్ ఆర్‌సీఈఎల్ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ సెంటర్ వ్యాపారుల వినూత్న ప్రచారం

ఫిలింనగర్: బర్డ్ ఫ్లూ దెబ్బతో చికెన్ తినే వారి సంఖ్య తగ్గిపోవడంతో చికెన్ వ్యాపారులు ఢీలా పడ్డారు. నిపుణులు చికెన్‌ను 70 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో ఉడికించి తిన్నప్పుడు ఎటువంటి సమస్యలుండవని చెప్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో వ్యాపారులు, ప్రముఖ చికెన్ పంపిణీ సంస్థల ప్రతినిధులు వినూత్న తరహా ప్రచారానికి దిగుతున్నారు. గురువారం ఫిలింనగర్‌లోని జ్ఞాని జైల్ సింగ్‌నగర్ కరెంట్ ఆఫీస్ వద్ద 300 కేజీల చికెన్ ఫ్రై, 3 వేల కోడి గుడ్లను బస్తీవాసులకు, స్థానికులకు పంచి పెట్టారు. చికెన్ తినడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదని చికెన్, కోడిగుడ్లు ఆరోగ్యానికి మంచి ప్రొటీన్ ఆహారమని ఈ సందర్భంగా వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చికెన్ వ్యాపారులు ఎలేందర్‌గౌడ్, యాకస్వామి, నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ డిఫెన్స్ కాలనీ, లంగర్‌హౌస్ కేబుల్ ఫీడర్ల పరిధిలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాల, హాషం నగర్, మందుల బస్తీ, డిఫెన్స్ కాలనీ, లంగర్‌హౌస్ చౌరస్తా, వినాయకనగర్ కాలనీ, హరిదాస్‌పుర, అలంకార్ థియేటర్ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని అధికారులు తెలిపారు.

## నేడు సిటీ కళాశాలలో 'ఓపెన్ డే'

చార్మినార్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 28న సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం 'ఓపెన్ డే' నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బాల భాస్కర్, భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ నైన వినోదిని తెలియజేశారు. ఈ సందర్భంగా కాలేజీలోని అత్యంత పురాతనమైన భౌతికశాస్త్ర ప్రయోగ పరికరాలను, అధునాతన సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శిస్తారు. సైన్స్ దినోత్సవ సందర్భంగా 'సుస్థిరాభివృద్ధి సాధనలో హరిత సాంకేతికత పాత్ర'అనే అంశంపై వివిధ కళాశాలల విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, వ్యాసరచన, 60 సెకన్ల వీడియో, వివిధ సైన్స్ మోడల్స్ పై పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని కార్యక్రమ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రతన్ కుమార్ (9618 125210), కో కన్వీనర్లు డా.చిన్ని కృష్ణ, డా. లక్ష్మి శ్రీనివాసరావు తెలియజేశారు. పోటీల్లో పాల్గొనదలిచిన విద్యార్థులు కళాశాలలో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

## ప్రొఫెసర్ కుమార్‌కు సర్ సీవీ రామన్ ఎక్సలెన్స్ అవార్డు



అఫ్జల్‌గంజ్: తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ప్రముఖ అడ్మినిస్ట్రేటర్, సివిల్ ఇంజినీర్ నిపుణులు, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరంకు 2025 సంవత్సరం సర్ సీవీ రామన్ ఎక్సలెన్సి అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేస్తామని వివరించారు. ప్రొఫెసర్ కుమార్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి అనుభవంతో ప్రపంచంలోని వివిధ నగరాల్లో (15 దేశాల్లో) పలు పరిశోధనలు సమర్పించారని ఆయన అన్నారు.

## 'హిందీ భాషను రాజకీయాల కోసం వాడుకోవద్దు'

గన్‌ఫౌండ్రీ: జాతీయ సమైక్యతను పెంపొందించి దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన హిందీ భాషను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి కోరారు. గురువారం నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార సభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కొద్ది రోజులుగా హిందీ భాషకు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం మాట్లాడడం దేశ అధికార భాషను అవమానించడమేనని తెలిపారు. హిందీ భాష అమలుపై వ్యక్తిగత అభిప్రాయం కాకుండా తమిళనాడు రాష్ట్రంలోని సంస్థ ప్రజానికం అభిప్రాయాన్ని తీసుకొని తద్వారా నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. హిందీ భాషపై ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని గుర్తు చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని హిందీ భాషను ప్రాథమిక స్థాయి నుంచి అమలు చేయాలని కోరారు.

# ఆకట్టుకున్న రోబోటిక్స్ అండ్ సైన్స్ ఫెయిర్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డాక్టర్ విఖార్ సయ్యద్ తదితరులు

చార్మినార్: భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, అగ్ర రాజ్యాలతో పోటీ పడుతుందని బీబీ కేన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ విఖార్ సయ్యద్ అన్నారు. రోబోటిక్స్ అండ్ సైన్స్ ఫెయిర్‌ను గురువారం డాన్ హైస్కూల్లో నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచం పోటీపడుతున్న తరుణంలో అందుకు అనుగుణంగా భారత దేశం ఆ దిశలో ముందుకు సాగుతుందన్నారు. విశ్వమంతా సైన్స్ అండ్ టెక్నాలజీపై ఆధారపడి ఉందని, ఈ తరహాలో సైన్స్ అండ్ టెక్నాలజీతో పాటు రోబోటిక్స్‌పై ఎగ్జిబిషన్లు నిర్వహించడం, విద్యార్థుల ప్రతిభకు పదను కల్పించినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తౌసిఫ్ ఉర్ రెహమాన్, సఫీ ఉర్ రెహమాన్, బీబీ కేన్సర్ ఇన్ జనరల్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ మొయిద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మాధవి, శ్రీలక్ష్మి

గోల్కొండ: ప్రభుత్వ విద్యా సంస్థల్లో అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం రిసాలబజార్‌లోని బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వ విద్యా సంస్థలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోల్కొండలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్థాపన అనంతరం భారీ స్థాయిలో ప్రతియేటా అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బోధన సిబ్బంది అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారన్నారు. బీజేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి మాట్లాడుతూ..తమ కళాశాలలో అన్ని విభాగాల్లో అత్యుత్తమ బోధన సిబ్బంది ఉన్నారన్నారు. అనంతరం కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులతో కలిసి వసతులతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హుమేరా సైయిద్, అకాడామిక్ కో ఆర్డినేటర్ ఎన్.ఎస్.రజనీష్, ఐక్యూక్ కో ఆర్డినేటర్ రజని, సుచేత పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న 'చరణదాసు'

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో చరణదాసు అనే జానపద నాటకాన్ని గురువారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. మంచి చెడు కలగలిసిన దొంగ స్వభావాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన తీరు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. భూమిక థియేట్ గ్రూప్ సమర్పణలో సాగిన ఈ నాటకానికి ఉదయభాను దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రసరంజని సంస్థ సభ్యులు సేనాపతి, నట్రాజ్, కామేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు తపాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా సంక్షేమం



మాజీ మేయర్ అమర్‌సింగ్‌ను సత్కరించిన దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా సంక్షేమం , ప్రజా అభ్యున్నతి కొనసాగుతుందని ఫిర్దోజిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్ పేర్కొన్నారు. పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆశీష్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా శివపార్వతుల పల్లకీ సేవ



చార్మినార్: శివ పార్వతుల కల్యాణ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించిన అనంతరం జరిగిన పల్లకీ సేవకు భక్తులు అడుగడుగునా స్వాగతం పలికారు. లాల్ దర్వాజాలోని శివాలయంలో ప్రముఖ న్యాయవాది మాణిక్ ప్రభు ఆధ్వర్యంలో జరిగిన శివపార్వతుల ఊరేగింపునకు లాల్ దర్వాజా సింహవాహిని ఆలయ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి నర్సింగ్‌రావు స్వాగతం పలికారు. బుధవారం రాత్రి లాల్ దర్వాజా వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పైనుంచి ఆయన ఉత్సవమూర్తులకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాణిక్ ప్రభుగౌడ్‌ను సత్కరించారు.

## రంజాన్ సందడి షురూ..

మార్కెట్‌లో రంజాన్ సందడి నెలకొంది. ప్రధాన మార్కెట్‌లలో రంజాన్ మార్కెట్‌లు సిద్ధమయ్యాయి. మెహిదీపట్నం చౌరస్తా, గుడిమల్కాపూర్, టోలిచౌకీ, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లోని రెస్టారెంట్ల వారు హలీం తయారీకి బట్టీలను సిద్ధం చేశారు. టోలిచౌకీలోని బిలాల్ మసీదు, మెహిదీపట్నం ఏక్‌మినార్ మసీదు, అహ్మద్‌నగర్ ఖాదరీయ మసీదులు విద్యుత్ దీపాలతో వాటి నిర్వాహకులు అలంకరించారు. – గోల్కొండ



టోలిచౌకీలో హలీం బట్టీ సిద్ధం



మెహిదీపట్నంలో విద్యుత్ దీపాలతో మసీదు

## బైక్‌పై వచ్చారు.. ఫోన్ లాక్కెళ్లారు

బంజారాహిల్స్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తులను నలుగురు ఆగంతకులు బైక్‌లపై వచ్చి దారి కాచి మొబైల్ ఫోన్ చోరీ చేసి పరారైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెస్ట్‌బెంగాల్ బౌరాకు చెందిన రెహమాన్ గడిచిన 5 ఏళ్ల నుంచి ఫిలింనగర్‌లోని ఓ దుకాణంలో మగ్గం వర్క్ చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో విధులు ముగించుకుని తన స్నేహితులు షఫీవుల్లా, గాబ్రియల్‌తో కలిసి బైక్‌పై బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని సయ్యద్‌నగర్‌లోని ఇంటికి వెళ్తున్నాడు. సయ్యద్‌నగర్ చిల్లా సమీపంలో రెండు బైక్‌లపై వచ్చి నలుగురు ఆగంతకులు వీరిని అడ్డగించి రెహమాన్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో జాగరణ

మహా శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భక్తులు జాగరణ చేశారు. గుడిమల్కాపూర్ చుడిబజార్, శంకర్‌బాగ్, బేగంబజార్ ఆలయాల్లో రాత్రంతా భక్తుల భక్తిగీతాలు, జాగరణలతో ఆలయాలు సందడిగా కనిపించాయి. – అబిడ్స్/జియాగూడ



చుడిబజార్ జాగరణలో గోషామహల్ కాంగ్రెస్ నాయకుడు బజ్జుగోప్



కాగజ్‌గూడ శంకర్‌జీ హనుమాన్‌జీ గుడిలో శివపార్వతుల కల్యాణం



కాశీబుగ్గ ఆలయంలో.. గోషామహల్ బీఆర్‌ఎస్ నేతలు పప్పుమాత్రే, లడ్డు



శంకర్‌బాగ్‌లో..



వేడుకల్లో సదానందం గుప్తా తదితరులు



జాగరణలో పాల్గొన్న అశేష భక్తజనం